పేదరికం నుంచి స్టేట్ టాపర్స్‌గా..

- పాలిటెక్నిక్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు
- అందరికీ ఆదర్శనీయంగా మారిన వైనం
- ఇటీవల అవార్డులు అందజేత



రాష్ట్ర టెక్నికల్ బోర్డు కార్యదర్శి సత్యనారాయణమూర్తి నుంచి స్టేట్ టాపర్‌గా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న లలితా కోమలి



సెకండ్ టాపర్ గోల్డ్‌మెడల్ అందుకున్న అఖిలాదేవి

గుడ్లవల్లేరు: ఆ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించారు. నిరుపేద కుటుంబాల్లో పుట్టి పాలిటెక్నిక్‌లో స్టేట్ టాపర్స్‌గా నిలిచారు ఆ ఆణిముత్యాలు. గుడ్లవల్లేరులో 17వ వార్షిక వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు స్మారక అవార్డుల ప్రదానోత్సవం ఇటీవల నిర్వహించారు. ఏపీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్టేట్ టాపర్ గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థి ఆలూరి లలితా కోమలి (99.52%), స్టేట్ సెకండ్ టాపర్ నందమూరు వాసవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థి అంకెం అఖిలాదేవి (98.95%)కు శేషాద్రి రావు స్మారక అవార్డులు ప్రదానం చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా సంస్థ కార్యదర్శి జి.వి.వి.సత్యనారాయణ మూర్తి హాజరై విజేతలకు అవార్డులు అందించారు. ఆ టాపర్స్ మనోగతాలు చూస్తే... పలువురు విద్యార్థులకు ఆదర్శప్రాయంగా మారాయి. అన్ని బ్రాంచీల విద్యార్థుల్లో ఓవరాల్ స్టేట్ టాపర్, సెకండ్ ర్యాంకులను గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులు సాధించినట్లుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ వారు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల్లో స్టేట్ ఫస్ట్, సెకండ్ టాపర్లగా విజయం సాధించారు. వీరి మనోగతాలు జూనియర్స్‌కు సందేశాన్ని ఇచ్చాయి. ఈ విజేతలు వారి కుటుంబాలతో కలిసి తమ మనోగతాన్ని పంచుకున్నారు.

ఐపీఎస్ కావడం నా డ్రీమ్



చిన్ననాటి నుంచే ఐపీఎస్ చేయాలనే డ్రీమ్ ఉంది. మాది పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సొలస గ్రామం. మా నాన్న తాపీ మేస్త్రి. టెక్నికల్ స్కిల్ కోసం బీటెక్‌ను నరసరావుపేట జేఎన్‌టీయూలో చేస్తున్నా. సివిల్స్ అయ్యాక తన వంటి ప్రతిభావంతులైన పేద పిల్లల్ని తన వలె ఉన్నత చదివించేందుకు కృషి చేయాలనేది నా ధ్యేయం. మా కాలేజీ ప్రోత్సాహంతో స్టేట్ టాపర్‌గా నిలిచాను.

– ఆలూరి లలితా కోమలి

పేదలకు న్యాయం చేస్తా



మా నాన్న సామాన్య రైతు. మాది మచిలీపట్నం. నాకు చదువు మీదున్న ఉత్సాహం చూసి, తనకు ఎన్ని కష్టాలున్నా విద్యను చెప్పించేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. ఎక్కడా రాజీ పడకుండా వ్యవసాయం మీదే నన్ను చదివించారు. వారి ప్రోత్సాహమే రాష్ట్ర స్థాయిలో నిలిచేందుకు దోహదపడింది. ఉన్నత శిఖరాలను చేరుకుని తనవంటి పేదలకు న్యాయం చేస్తా.

– అంకెం అఖిలాదేవి

ఉత్తమ విద్యార్థులకు బాసట



సాంకేతిక విద్యలో ఉత్తమ విద్యార్థులను తీర్చి దిద్దేందుకు ఈ స్టేట్ లెవల్ అవార్డులను శేషాద్రిరావు పేరిట 17 ఏళ్లగా అందిస్తున్నాం. మా ప్రయత్నం ఫలించి ఎంతోమంది పేద విద్యార్థులు తమ ప్రజ్ఞా పాటవాలను కనబరిచిన విజేతలుగా నిలుస్తున్నారు. ఏటా మా నాన్న గారి పేరిట స్టేట్ అవార్డులు ఇవ్వటం చాలా గర్వకారణంగా ఉంది.

– వల్లూరుపల్లి సత్యనారాయణరావు (బాబ్జి), కాలేజీ సెక్రటరీ

ఆరోగ్యకర పోటీతత్వం



రాష్ట్ర స్థాయిలో టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి నాన్న గారి పేరిట అవార్డులు ఇవ్వటం ఆరోగ్యకర పోటీతత్వం విద్యార్థుల్లో ఏర్పడుతుంది. మా ప్రాంతంలో విద్యార్థులు కూడా ఆ అవార్డులు పొందటం గర్వకారణంగా ఉంది. 2009 నుంచే ఈ అవార్డులను వల్లూరుపల్లి శేషాద్రిరావు పేరిట ఇస్తున్నాం.

– వల్లూరుపల్లి రామకృష్ణ, కాలేజీ కో-కరస్పాండెంట్

క్లుప్తంగా

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



గుడివాడరూరల్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్. చంటిబాబు తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిసరాలను సిబ్బందితో కలసి స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలు చేయడం సులభమవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

బాబా మందిరంలో అన్నసమారాధన

మండవల్లి: శ్రీ దత్త పరంపర సహిత షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. దాతల ఆర్థిక సాయంతో నిర్వహించిన అన్నసమారాధనలో మండవల్లి, కొర్లపాడు, గన్నవరం, పెరికెగూడెం తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ, కన్నయ్య దంపతులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



గుడివాడరూరల్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లిస్తున్న మెస్‌చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలని కోరారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యంకు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నాగేంద్ర, పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వరి యాజమాన్య పద్ధతులపై శిక్షణ



పెదసనగల్లు(మొవ్వ): గ్రామంలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), మొవ్వ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో వరి యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ తదితర కాంప్లెక్స్ ఎరువులు గురించి, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సూరపనేని శ్యామల, ఏవో బి.సురేష్ బాబు నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.రాజేష్, గ్రామ రైతులు, మండలంలోని పలువురు సచివాలయాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతపై వలంటీర్లకు శిక్షణ



మండవల్లి: సంపూర్ణ అక్షరాస్యతపై ఏపీఎం జి.రాజశ్రీ గురువారం వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ చదువుకుని ప్రభుత్వ పథకాలను, ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించడం లక్ష్యంగా వలంటీర్లు పనిచేయాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ ప్రాధాన్యం తెలుసుకోవాలని సూచించారు. సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆవులు స్వర్ణకుమారి, సెక్రెటరీ బోడావుల లక్ష్మి పాల్గొన్నారు.

పీఏసీఎస్ బ్యాంక్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం

వెంట్రప్రగడ (పెదపారుపూడి): వెంట్రప్రగడ పీఏసీఎస్ బ్యాంక్ చైర్ పర్సన్‌గా గ్రామానికి చెందిన కూచిపూడి వెంకట సుబ్బారావు చౌదరి చేత ఎమ్మెల్యే వర్ల కుమార రాజా గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. బ్యాంక్ పర్సన్‌గా కొమ్ము వీర్రాజు, గుడ్డేటి అర్జునరావు చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. టీడీపీ మండల నాయకులు సత్యనారాయణ, చలసాని రమేష్ చౌదరి, ఆంజనేయులు తదితరులున్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం

గుడివాడరూరల్: అర్హులైన వికలాంగుల పింఛన్లు కూటమి ప్రభుత్వం తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని లింగవరం గ్రామంలో గురువారం ఆయన మాట్లాడుతూ కావాలనే అర్హుల పింఛన్లు కూటమి ప్రభుత్వం తొలగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా కూడా కావాలనే పింఛన్లు తొలగింపుపై దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి అర్హులైన వారందరికీ పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దివ్యాంగులతో కలసి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

పమిడిముక్కల: విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో నడుస్తున్న అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, చెరకు రైతుల సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 26వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం కళాశాలకు వచ్చే విద్యార్థులు పది, ఇంటర్ మార్కుల జాబితాలు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఓసీలకు రూ.400, బీసీలకు రూ.300, ఎస్సీ, ఎస్టీలకు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు(పెదపారుపూడి): పాములపాడు పీఏసీఎస్ బ్యాంక్ సభ్యుడు రాజబోయిన నాగేశ్వరరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో మట్టి ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబసభ్యులకు బ్యాంక్ అధ్యక్షుడు కాటూరి వెంకటకృష్ణ, సీఈవో పి. కుమారి రూ.10 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థులకు ఉన్నత స్థానాలు

డీఎస్పీ వి.ధీరజ్ వినీల్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. స్థానిక వీకేఆర్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే అనర్థాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. గుడివాడ సబ్ డివిజన్‌లో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరైన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వి ప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్, డీన్ బి.కళ్యాణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.దిలీప్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించడం తప్పనిసరి

గుడివాడరూరల్: వినాయక చవితి వేడుకలు నిర్వహించే కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల నిబంధనలు పాటించాలని తాలూకా ఎస్ఐ ఎన్. చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలు నిర్వహించే వారు ముందుగా కమిటీ సభ్యులను ఏర్పాటు చేసుకోవాలని, ఆ కమిటీ వారిదే పూర్తి బాధ్యత అన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా పంచాయతీ, మున్సిపాల్టీ అధికారుల అనుమతులు తీసుకోవాలని సూచించారు. సొంత స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు స్థల యజమానుల అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో ప్రజలకుగాని, ట్రాఫిక్‌కు గాని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు.

వినాయకచవితి ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలి

పమిడిముక్కల: వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బి.శ్రీను తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఉత్సవాలు నిర్వాహకులు ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, కమిటీ వారిదే పూర్తి బాధ్యత అని గుర్తించాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయుటకు పంచాయితీ అనుమతి తీసుకోవాలన్నారు. సొంత స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయుటకు యజమాని అనుమతి పొందాలన్నారు. విగ్రహ ఏర్పాటు ప్రదేశాలలో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఆటంకాలు కలుగజేయకూడదని అన్నారు.

సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయండి



కైకలూరు తాలూకా సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు



కలిదిండి తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

కై కలూరు/మండవల్లి: అంగన్‌వాడీలకు సమ్మెకాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కైకలూరు, కలిదిండి మండల కేంద్రాల్లో నిరసన, మానవహారాలను గురువారం నిర్వహించారు. తహసీల్దార్లకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తక్షణమే వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలని, అన్ని యాప్‌లను ఒకే యాప్‌గా మార్చాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ని రద్దు చేయాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, రైతు సంఘం నాయకులు సీహెచ్ శ్రీకాంత్, సీఐటీయూ ప్రాజెక్టు కార్యదర్శి పి.సుజాత, సెక్టార్ లీడర్లు మీనాకుమారి, ఝాన్సీరాణి, సత్యవతి, షేక్ అబీదాబేగం మేనకాలక్ష్మి, సూర్యకుమారి, మేరీలక్ష్మి, ప్రమీలరాణి, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్యామల మాల



శ్యామలాంబ మాలధారణ దీక్షలో భక్తులు (ఫైల్)

కై కలూరు: ఏటా దసరా సందర్భంగా కై కలూరు శ్యామలాంబ అమ్మవారి క్షేత్రంలో ధరించే శ్యామలా మాల దీక్ష ఈ నెల 23 నుంచి అక్టోబరు 2 వరకు కొనసాగుతోందని ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ గురువారం చెప్పారు. మాలధారణలో మండల దీక్ష ఈ నెల 23 నుంచి అక్టోబరు 2 వరకు, అర్ధమండల దీక్ష సెప్టెంబరు 12 నుంచి అక్టోబరు 2 వరకు, నవదిన దీక్ష సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు భక్తులు చేయవచ్చన్నారు. శ్యామలా మాల స్వీకరించే భక్తులు నీలివర్ణం దుస్తులు, తెల్లని స్ఫటిక మాల ధరించాలన్నారు. నూతనంగా మాల ధరించే భక్తులకు దేవస్థానం తరుపున ఉచిత శ్యామలాంబ రాగి ప్రతిమ అందిస్తామన్నారు. మండల దీక్ష స్వీకరించు భక్తులు ఈ నెల 22వ తేదీ లోపు, అర్ధమండల దీక్షకు సెప్టెంబర్ 11, నవదిన దీక్షకు సెప్టెంబర్ 21 లోపు దేవస్థాన కార్యాలయంలో పేరు, గోత్రం, చిరునామా నమోదు చేయించుకోవాలని సూచించారు. నూతన భక్తులకు దీక్ష ప్రారంభం రోజున దేవస్థాన అర్చకులచే మాల స్వీకరణ జరిపిస్తామన్నారు.

ఘనంగా ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవం



కైకలూరు: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అధ్యక్షతన కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంతో గురువారం జరిగింది. ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు నూతన అవిష్కరణల ద్వారా వ్యవస్థాపకులుగా రూపొందాలని కోరారు. కామర్స్ అధ్యాపకుడు నున్న శ్రీనివాస్ నూతన ఆవిష్కరణల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు డాక్టర్ ఆర్.జాలబాబు, బట్టు వేదాంతం, డాక్టర్ బీ.జగన్‌మోహనరావు, ఎంఏ గఫర్, ప్రసూనాంబ, రేణుకాదేవీ తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి



కైకలూరు: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ సాధనకై ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను కై కలూరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా గురువారం అవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్సీ 2003 కృష్ణా జిల్లా ఫోరం మహిళా కన్వీనర్ రమీజున్నిసా, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘు కార్యదర్శి వి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ ఏలూరు జిల్లా కార్యదర్శి రవిశంకర్, కై కలూరు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు దండే బెనర్జీ, యూటీఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు, సనావుల్లా, నాగకళ్యాణి, సలీమా బేగం, హస్సైన్, అబ్దుల్ సత్తార్, సంజీవరావు పాల్గొన్నారు.

వరద నీరు రాకుండా చర్యలు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): కృష్ణానదికి భారీ వరద నేపథ్యంలో మండలంలోని ఉత్తరచిరువోలు లంక కృష్ణానది అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గ్రామంలోకి వరద నీరు చొచ్చుకురాకుండా ఇసుక మూటలను అడ్డుగా వేశారు. బుధవారం రాత్రి అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా పొలాల్లోకి నీరు చేరడంతో ఆందోళన చెందిన స్థానికులు ఇసుక మూటలు వేశారు. సాగు నీటి సంఘం అధ్యక్షుడు భోగిరెడ్డి సాంబశివరావు, సభ్యులు బడే రామాంజనేయులు, ఏఈఈ హరీష్ తదితరులున్నారు.

ఉప్పుటేరు ఆక్రమణలు తొలగిస్తున్నాం

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



ఉప్పుటేరు రైల్వే బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన డెక్కను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: కొల్లేరు సరస్సుకు చేరే నీటిని సముద్రానికి పంపించే క్రమంలో ఉప్పుటేరు రైల్వే బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, ఆక్రమణలు తొలగిస్తున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. తొలగింపు పనులను ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్‌తో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉండి ఎమ్మెల్యే, డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో కలసి ఉమ్మడిగా ఉప్పుటేరు ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. కూటమి పార్టీలో వారైన ఆక్రమణ చేస్తే తొలగించాల్సిందే అని అధికారులకు చెప్పామన్నారు. దాదాపు 8 పొక్లెయిన్లతో తొలగింపు పనులు చేపట్టామని పేర్కొన్నారు. అంతకుముందు ఆటపాక వద్ద పుల్లవ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపల రైతు సంఘ అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు, తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, డ్రెయినేజీ డీఈ ఎం.రామకృష్ణ, పాల్గొన్నారు.


వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

కైకలూరు: గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. కైకలూరు డీఆర్‌డీఏ కార్యాలయంలో అక్షర ఆంధ్రా లెటరసీ ఫోగ్రాం (ఉల్లాస్)పై వీఓఏలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చదవడం, రాయడం, సంతకాలు చేయడం వంటివి 18 నుంచి 55 సంవత్సరాల వయోజనులకు నేర్పించాలని ఎంపీపీ చెప్పారు. కైకలూరు డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీరామ్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 12 వేల మంది నిరాక్షరాస్యులను గుర్తించామన్నారు. మొదటి విడతగా వీవోఏలు 2,400, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది 1000 మందికి కలపి మొత్తం 3,400 మంది వయోజనులకు అక్షరాలు నేర్పుతారన్నారు. దీని కోసం వీవోఏలు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు 53 మందికి శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వై.రామకృష్ణ, సీడీపీవో డాక్టర్ ఎన్.దీప్తి, ఎంఈవో–2 శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం చరణ్, సీసీలు సైదానీ, పాపమ్మ, రవికుమార్, ఉషా తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకురాలి పోస్టుకు దరఖాస్తులు

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ ఆయుష్ వైద్యశాలలో పార్ట్ టైమ్ ప్రాతి పదికన యోగా శిక్షకురాలి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాజ ఆయూష్ డిపార్ట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. వైద్య చికిత్స కేంద్రం పరిధిలోని అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. నెలకు 20 పని గంటలపాటు ఆయుష్ డిస్పెన్సరీలో యోగా నేర్పించాల్సి ఉందన్నారు. గంటకు రూ 250 వంతున గౌరవ వేతనం చెలిస్తామని వెల్లడించారు. యోగాలో ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, విద్యార్హత లేకున్నా యోగాలో అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఎక్కువ విద్యార్హతతో కూడిన అభ్యర్థులు లేని పక్షంలో మాత్రమే తరువాతి విద్యార్హత గల అభ్యర్థులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో డిస్పెన్సరీలో ఈ నెల 26వ తేదీన ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

విజయదుర్గ అమ్మవారికి గాజుల అలంకరణ



మండవల్లి: మండవల్లి శ్రీ విజయ దుర్గా అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేకంగా గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా భక్తులు, మహిళలు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

పుట్లమ్మ సత్రం అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం



పామర్రు(మొవ్వ): పట్టణ పరిధిలో ప్రసిద్ధిగాంచిన బొమ్మారెడ్డి పెద బుల్లయ్య అలియాస్ వెంకటరెడ్డి (పుట్లమ్మ) సత్రం అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఆరుమళ్ళ గంగాభవాని, కమిటీ సభ్యులుగా పరిశ రాంబాబు, చిన్నం సుబ్రహ్మణ్యేశ్వరమ్మ, ఆర్.కాశీ విశాలాక్ష్మి, చామర్తి సుధాకర్, పామర్తి శివ మల్లేశ్వరరావు, కె.అంజిబాబు, పి.నాగశిరోమణి, వి.పావనితో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీ దాసు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరస సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, గ్రూప్ దేవాలయాల అధికారి వెంకటేశ్వరరావు, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.